నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం

ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..
సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

విలేకరులు కావలెను...
సంచలన దినపత్రిక నిలువుటద్దం కు - తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9059548848

హైదరాబాద్. | ఎడిటర్:- వై. రమ నాగరాజు | సంపుటి:-32 | సంచిక:-227 | ఆదివారం 11-10-2026

భూ వివాద రహిత తెలంగాణే ప్రజాప్రభుత్వ లక్ష్యం

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

సుమారు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టడం జరిగింది. భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర

ఎల్‌నినో ప్రభావంపై సీఎం సమీక్ష

- 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు
- ఎల్‌నినో ప్రభావంపై సీఎం ప్రత్యేక సమీక్ష
- రైతుల సమస్యలపై మంత్రులతో చర్చ
- రూ.20 వేల కోట్ల ప్యాకేజీ కోసం కేంద్రానికి విజ్ఞప్తి
- సాగునీరు, తాగునీరు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై

ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది

- అధికారంలో ఉన్నవారికి ఈసీ రక్షణ కవచం కాదన్న హరీశ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- అన్నిటికన్నా ప్రజాస్వామ్యం గొప్పదని వ్యాఖ్య

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం- మిగతా 2 లో

ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

- ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి
- రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ
- ఫలితాలు వ్యతిరేకిస్తే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపాటు- మిగతా 2 లో

రాష్ట్రపతిని కలిసిన ఇండియా కూటమి నేతలు

"ఓట్ల దొంగతనం"పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన విపక్షాలు

- ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి కోరినట్లు వెల్లడించిన రాహుల్
- ప్రధాని, హోంమంత్రి, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపణ
- సీఈసీ రాజీనామా చేయాలని, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరపాలని డిమాండ్
- సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిన విపక్ష కూటమి

దేశంలో "ఓట్ల దొంగతనం" (జశీవ ఎష్ట్రశీతీఱ) జరుగుతోందంటూ తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమను కోరినట్లు లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్

శరన్నవరాత్రులు 2026 అక్టోబర్ 11, ఆదివారం నుంచి ప్రారంభమవుతాయి

అక్టోబర్ 10, శనివారం: మహాలయ అమావాస్య --- పితృపక్షం ముగింపు.
అక్టోబర్ 11, ఆదివారం: శరన్నవరాత్రుల ప్రారంభం, కలశ స్థాపన.
అక్టోబర్ 19, సోమవారం: నవరాత్రుల చివరి రోజు.
అక్టోబర్ 20, మంగళవారం: విజయదశమి (దసరా).

పాక్ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్' అన్న భారత్ అసలు దాని అర్థం ఏంటి?

- ఐరాస వేదికగా షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్' అన్న భారత్
- పాకిస్థాన్ ఎన్నికల్లో 'ఫామ్ 45' అనేది ప్రతి పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల వివరాలను చూపించే పత్రం
- 'ఫామ్ 47' నియోజకవర్గం స్థాయిలో ఫలితాలను చూపించే డాక్యుమెంట్
- 2024 ఎన్నికల్లో ఫామ్ 45, ఫామ్ 47 వివరాలు సరిపోలలేదన్న పీటీఐ
- ఫామ్ 47లో అక్రమాలు చేశారని ఆరోపించే కోణంలోనే కొత్త పదబంధంతో విమర్శలు- మిగతా 2 లో

తమిళనాడు ఉప ఎన్నికల ఫలితాలు

విజయ్ పార్టీ గెలుపుపై స్టాలిన్ స్పందన

- తమిళనాడు ఉపఎన్నికల్లో అధికార టీవీకే విజయం
- ఇది ద్రోహ రాజకీయాల తాత్కాలిక గెలుపన్న స్టాలిన్
- మైనారిటీ ప్రభుత్వాన్ని మెజారిటీగా మార్చే కుట్ర అని విపక్షాల ఆరోపణ
- డబ్బు, అధికార దుర్వినియోగంతోనే గెలిచారంటూ విమర్శలు- మిగతా 2 లో

భద్రతా వలయంలో ఢిల్లీ!

- అన్ని అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా
- సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల భారీ నిరసనలకు పిలుపు
- ఢిల్లీలో 20 వేల మంది బలగాలతో కఠిన భద్రతా ఏర్పాట్లు
- 57 మెట్రో స్టేషన్ల మూసివేయాలన్న పోలీసులు.. పలు రైళ్ల సర్వీసులు రద్దు
- జంతర్ మంతర్ వద్ద నిరసనకు పోలీసుల అనుమతి నిరాకరణ
- పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షలు

నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు
యోగి సర్కారు కీలక నిర్ణయం!

- పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం
- మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం
- మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి
- విమానాశ్రయం తొలి దశను మార్చిలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- తొలి దశలో ఏడాదికి 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై చంద్రబాబు స్పందన

- స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లపై ఏపీ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత
- 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటరాదన్న హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా బీసీలకు అండగా ఉంటామన్న చంద్రబాబు

ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది

మొదటిపేజీ తరువాయి - (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

మొదటిపేజీ తరువాయి - కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

తమిళనాడు ఉప ఎన్నికల ఫలితాలు

మొదటిపేజీ తరువాయి - తమిళనాడులోని ధరాపురం, మధురాంతకం అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉపఎన్నికల్లో అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) విజయం సాధించింది. అయితే, ఈ ఫలితాలపై డీఎంకే అధ్యక్షుడు ఎం.కే. స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. ఇది "ద్రోహ రాజకీయాల తాత్కాలిక విజయం" అని అభివర్ణించిన ఆయన, "తప్పుడు ప్రతిష్ఠ రాజకీయాల పతనం మొదలైంది" అని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా వేదికగా శుక్రవారం స్టాలిన్ స్పందిస్తూ, అధికార టీవీకేకు వ్యతిరేకంగా పోలైన ఓట్లను గమనిస్తే, మెజారిటీ ప్రజలు ఆ పార్టీని తిరస్కరించినట్లేనని విశ్లేషించారు. ఎమ్మెల్యేల బేరసారాలు, ఇతర పార్టీల నేతలను ప్రలోభపెట్టడం, కక్ష సాధింపు చర్యలు, అనాగరిక చర్యలను మానుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో రీల్స్ చేయడంపై కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి విజయ్ దృష్టి సారించాలని హితవు పలికారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఐదు నెలలకే ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి అధికార పార్టీలో చేరడం వల్లే ఈ ఉపఎన్నికలు వచ్చాయని స్టాలిన్ ఆరోపించారు. దీనిని ఆయన "ప్రజాస్వామ్య హత్య"గా పేర్కొన్నారు. ధన బలం, అధికార దుర్వినియోగం, పోలీసు బలంతోనే టీవీకే గెలిచిందని విమర్శించారు. ముఖ్యమంత్రి విజయ్ కేవలం తన సినీ ఇమేజ్‌తో రాజకీయాలు చేస్తున్నారని, సొంతంగా మెజారిటీ సాధించలేక ఎమ్మెల్యేల బేరసారాలతో ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్నారని దుయ్యబట్టారు. విజయ్ ఈ రెండు నియోజకవర్గాల్లో నాలుగు రోజుల పాటు పర్యటించి, టీ దుకాణాలను సందర్శించడం, ట్రాక్టర్ నడపడం వంటివి చేయడంపై ఆయన ఎద్దేవా చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి కూడా టీవీకే విజయం తాత్కాలికమేనని వ్యాఖ్యానించారు. అధికార దుర్వినియోగం, విచ్చలవిడి డబ్బు పంపిణీతోనే వారు గెలిచారని ఆరోపించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలతో బేరసారాలు సాగించి, మైనారిటీ ప్రభుత్వాన్ని మెజారిటీగా మార్చుకునే దురుద్దేశంతోనే టీవీకే ఈ ఉపఎన్నికలను కొనితెచ్చిందని విమర్శించారు.

నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంతో.. ట్రంప్ అసహనం

మొదటిపేజీ తరువాయి - నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది విజేతగా నిలిచిన దక్షిణాఫ్రికా మానవ హక్కుల న్యాయ నిపుణురాలు నవీ పిళ్లైతో పాటు, అవార్డును ప్రకటించిన నార్వేజియన్ నోబెల్ కమిటీని విమర్శిస్తూ చేసిన ఒక పోస్టును ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో రీషేర్ చేశారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే ట్రంప్ ఈ మేరకు స్పందించారు. తన మాజీ న్యాయవాది డేవిడ్ షోయెన్ చేసిన ఒక పోస్టును ఆయన పంచుకున్నారు. "ఐక్యరాజ్యసమితికి చెందిన నవీ పిళ్లైకు ఈ పురస్కారాన్ని అందజేయడం ద్వారా నోబెల్ కమిటీ కోలుకోలేని విధంగా అవమానానికి గురైంది. ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి విలువను ఇది తగ్గించింది" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. నవీ పిళ్లై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను తీవ్రంగా ద్వేషిస్తారని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ హమాస్‌కు అండగా నిలిచారని అందులో ఆరోపించారు. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని ఆమె నేతృత్వంలోని ఐరాస కమిషన్ నివేదించడాన్ని ఒక "ప్రహసనం"గా అభివర్ణించారు. అదే సమయంలో, అబ్రహాం ఒప్పందాలు, బందీల విడుదల, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నివారణకు ట్రంప్ చేసిన కృషిని కొనియాడుతూ, ఆయనకే నోబెల్ దక్కాలని ఆ పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, 2026 సంవత్సరానికి గాను నోబెల్ శాంతి బహుమతిని దక్షిణాఫ్రికాకు చెందిన 85 ఏళ్ల నవీ పిళ్లైకు నార్వేజియన్ నోబెల్ కమిటీ ప్రకటించింది. యుద్ధ నేరాలు, మారణహోమాలు, మానవ హక్కుల ఉల్లంఘనలకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టానికి కట్టబెట్టడంలో ఆమె చేసిన సుదీర్ఘ పోరాటానికి ఈ గుర్తింపు దక్కినట్లు కమిటీ తెలిపింది. గతంలో ఆమె ఐరాస మానవ హక్కుల హైకమిషనర్‌గా, అంతర్జాతీయ న్యాయస్థానం న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ అవార్డు విషయం తెలిసే సమయానికి నవీ పిళ్లై జర్మనీలోని న్యూరెమ్‌బర్గ్ కోర్టులో ఒక కార్యక్రమంలో ఉన్నారు. ఈ వార్త తెలియగానే ఆమె చమత్కరిస్తూ, "మీరు ఇంకాస్త గట్టిగా చప్పట్లు కొడితే, ఈ బహుమతిని నేను ట్రంప్‌తో పంచుకుంటా" అని వ్యాఖ్యానించడంతో అక్కడ నవ్వులు పూశాయి. ట్రంప్ చాలాకాలంగా నోబెల్ శాంతి బహుమతిని ఆశిస్తున్నారు. ఈ ఏడాది పాకిస్థాన్ ప్రధాని ఆయన పేరును నామినేట్ కూడా చేశారు.

భద్రతా వలయంలో ఢిల్లీ!

మొదటిపేజీ తరువాయి - ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్ం భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఇదిలా ఉండగా, ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పుర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు యోగి సర్కారు కీలక నిర్ణయం!

మొదటిపేజీ తరువాయి - పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై చంద్రబాబు స్పందన



మొదటిపేజీ తరువాయి - స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదంటూ గతంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం కోటా 50 శాతం మించకూడదన్న నిబంధనను హైకోర్టు గుర్తుచేయడం సమంజసమేనని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. న్యాయస్థానాల తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, తమ కూటమి ప్రభుత్వం బీసీలకు పూర్తిస్థాయిలో రాజకీయంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు పార్టీ తరఫున అధిక శాతం సీట్లు కేటాయించి, వారి రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కడాన్ని వైసీపీ సహించలేకపోయిందని చంద్రబాబు ఆరోపించారు. అందుకే కోర్టులకు వెళ్లి, బీసీల రాజకీయ వాటాను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల కోటాను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలు సుమారు 16,800 పదవులు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.

భూ వివాద రహిత తెలంగాణే ప్రజాప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి - భూ రీ--సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నాము. డా. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూ సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించడం జరిగింది. రీ--సర్వేను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు 7 జోన్లకు ఒక్కో జోన్‌కు రెవెన్యూ , సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించాము. సర్వేలో వేగం ,నాణ్యతతో పాటు ప్రతి దశలోపర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేయడం జరిగింది. రీ--సర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించాను. సర్వే పురోగతి, రోజువారీ పనితీరు, గ్రామాల వారీగా పూర్తయిన సర్వే, పనిచేస్తున్న సర్వే బృందాలు, ఉపయోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి వివరాలన్నీ డాష్‌బోర్డులో రియల్‌టైమ్‌లో కనిపించేలా టెక్నాలజీని వినియోగించాలని సూచించడం జరిగింది. రాష్ట్రంలో తొలి దశలో 365 నక్షాలేని గ్రామాల్లో అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,240 మొత్తం 2768 గ్రామాల్లో రీసర్వే సాగుతుంది. ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగింది. రీ--సర్వే ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైయింది. ప్రతి వారం రాష్ట్రస్థాయిలో అధికారులు సమీక్ష నిర్వహించాలని, ప్రతి 15 రోజులకు స్వయంగా సమీక్షించి పురోగతిని పరిశీలిస్తానని, రీ--సర్వే పేరుతో స్థానికంగా ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేయడం జరిగింది. ఎర్రవల్లిలో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువ ఉంది. సర్వే కోసం మరొక సారి నోటీసులు ఇవ్వడం జరిగింది. ఎర్రవల్లిలో అసైన్డ్ భూములు కొన్ని చేతులు మారాయి వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటాము. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ ల్యాండ్ ఉంటే వాటిని పేదలకు పంచుతాం అని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేయడం జరిగింది.

రాష్ట్రపతిని కలిసిన ఇండియా కూటమి నేతలు

మొదటిపేజీ తరువాయి - కుమార్ చుట్టూ అలుముకున్న వివాదంపై శుక్రవారం ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతిని కలిసిన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహా పలువురు విపక్ష నేతల ప్రతినిధి బృందం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముతో సమావేశమైంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, భారత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వారు రాష్ట్రపతికి ఒక వినతిపత్రం సమర్పించారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని రాష్ట్రపతికి తెలియజేశామని చెప్పారు. "మా ఆరోపణలను నిరూపించేందుకు ఆధారాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఆమెకు సమయం ఉన్నప్పుడు తప్పకుండా ఆధారాలను సమర్పిస్తాం" అని రాహుల్ తెలిపారు. రాష్ట్రపతి తమ వాదనలను తిరస్కరించలేదని, ప్రశ్నించలేదని, సమావేశం సంతృప్తికరంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించి, ప్రధాన న్యాయమూర్తికి కూడా ఒక వినతిపత్రం అందజేస్తామని రాహుల్ ప్రకటించారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. రాష్ట్రపతి తమ వాదనలను ఓపికగా విన్నారని తెలిపారు. "ఓట్ల దొంగతనంపై మేం నాలుగు రోజులుగా చేస్తున్న ఆందోళనల గురించి రాష్ట్రపతికి వివరించాం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన తీవ్రమైన తప్పిదాన్ని, ఎన్నికల కమిషన్ పనితీరుపై మా ఆందోళనలను తెలియజేశాం. ఈవీఎంలను పక్కనపెట్టి, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని మేం డిమాండ్ చేశాం" అని ఖర్గే వివరించారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. "మేం వినతిపత్రం ఇచ్చాం. దీనిపై విచారణ జరుపుతానని, వివరాలు పరిశీలిస్తానని, ఆధారాలు కావాలని ఆమె చెప్పడాన్ని మేం సానుకూల దృక్పథంతో చూస్తున్నాం. దేశ ప్రజలు ఆందోళనగా ఉన్నారు, రాజ్యాంగ పరిరక్షకురాలిగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆమెను కోరాం" అని అన్నారు. ఈ ప్రతినిధి బృందంలో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు. గత కొద్ది రోజులుగా ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితా సవరణ తీరుపై విపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

పాక్ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్' అన్న భారత్ అసలు దాని అర్థం ఏంటి?

మొదటిపేజీ తరువాయి - పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ తీవ్ర విమర్శలు చేసింది. ఆ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్'గా అభివర్ణించింది. ఉగ్రవాదాన్ని అరికట్టడంపై దృష్టి పెట్టకుండా తప్పుడు ప్రచారానికి పాకిస్థాన్ ప్రాధాన్యం ఇస్తోందని భారత దౌత్యవేత్త రఘు పూరి ఆరోపించారు. గతంలో పాకిస్థాన్ పెంచి పోషించిన ఉగ్రవాద సంస్థలే ఇప్పుడు ఆ దేశానికి సమస్యగా మారాయని వ్యాఖ్యానించారు. అయితే, ఈ విమర్శ వెనుక ఉన్న 'ఫామ్ 47' వివాదం ఏంటి? 2024లో పాకిస్థాన్‌లో జరిగిన ఎన్నికల నుంచి ఈ పదం ఎక్కువగా వినిపిస్తోంది. ఆ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన 'పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్' (పీటీఐ) పార్టీ ఆరోపించింది. ఎన్నికల ఫలితాలను మార్చి షరీఫ్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించింది. ఈ ఆరోపణలను పాక్ ప్రభుత్వం ఎలా చూస్తోందనే అంశం వేరైనా, ఎన్నికల ఫలితాల లెక్కల్లో తేడాలున్నాయన్నది అప్పటి వివాదంలో ప్రధాన అంశం. పాకిస్థాన్ ఎన్నికల్లో 'ఫామ్ 45' అనేది ప్రతి పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల వివరాలను చూపించే పత్రం. ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయన్న సమాచారం ఇందులో ఉంటుంది. 'ఫామ్ 47' మాత్రం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల ఫలితాలను కలిపి రూపొందించే తాత్కాలిక సమగ్ర ఫలితాల పత్రం. అంటే 'ఫామ్ 45' పోలింగ్ కేంద్రం స్థాయిలో, 'ఫామ్ 47' నియోజకవర్గం స్థాయిలో ఫలితాలను చూపిస్తాయి. 2024 ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో 'ఫామ్ 45'లో ఉన్న ఓట్ల వివరాలు, 'ఫామ్ 47'లో నమోదైన లెక్కలతో సరిపోలలేదని పీటీఐ ఆరోపించింది. తమ మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల లెక్కల ప్రకారం గెలిచినా, తుది ఫలితాల్లో ఓడిపోయినట్లు చూపించారని పేర్కొంది. ఆ ఎన్నికల్లో ఇమ్రాన్ ఖాన్ పార్టీ మద్దతున్న స్వతంత్ర అభ్యర్థులు అత్యధికంగా 101 స్థానాలు గెలుచుకున్నారు. అయినప్పటికీ పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) ఇతర పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కామన్వెల్త్ ఎన్నికల పరిశీలకుల నివేదికలోనూ కొన్ని 'ఫామ్ 47' పత్రాల్లో మార్పులు జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు. దీంతో షరీఫ్ ప్రభుత్వాన్ని విమర్శించేందుకు పీటీఐ 'ఫామ్ 47 సర్కార్' అనే పదాన్ని వాడుతోంది. ఎన్నికల్లో అక్రమాల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వమని ఆరోపించడమే ఈ పదం వెనుక ఉద్దేశం. ఐరాస వేదికగా భారత్ ఈ పదాన్ని ప్రస్తావించడంతో పాకిస్థాన్ ఎన్నికల విశ్వసనీయతపై ఉన్న వివాదం మరోసారి అంతర్జాతీయంగా చర్చకు వచ్చింది.

ఎల్‌నినో ప్రభావంపై సీఎం సమీక్ష

ఈ సమావేశంలో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్ డిమాండ్ పెరుగుదల వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు సమాచారం. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు అవసరమైన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. కరువు మండలాల ప్రకటనతోపాటు ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రాన్ని కోరింది. రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం నిర్వహణపై కూడా చర్చించే అవకాశముంది. రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని రైతులకు ఉపశమనం కలిగించే చర్యలపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోనున్నారు.

సదాశివపేట పట్టణం లోని సిద్దాపూర్

రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

జగ్గారెడ్డి, నిర్మల

కూల్చివేతలు లేకుండా, పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలి

అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన.

సంగారెడ్డి అక్టోబర్ 10 నిలువుటద్దం ప్రతినిధి : సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఆయన సిద్దాపూర్ రోడ్డును పరిశీలించారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో రోడ్డు నిర్మాణం, వర్షపు నీటి పారుదల, కల్వర్టులు, డ్రైనేజీ పనులపై సమీక్ష నిర్వహించారు. మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ కాలనీ చివరి వరకు పలుమార్లు పనులు చేపట్టినా రోడ్డు సమస్య పరిష్కారం కాకపోవడంపై జగ్గారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిద్దాపూర్ రోడ్డు వేయించానని గుర్తుచేశారు. గత పదేళ్లలో ఈ రోడ్డు విషయంలో ఏం జరిగిందో తెలియదన్నారు. ఇకపై సిద్దాపూర్ రోడ్డు సమస్య పదేపదే చర్చకు రాకుండా పటిష్ఠంగా పనులు చేపట్టాలని సూచించారు. మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ ఈద్గా వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు సాంకేతికంగా సరైన లెవల్స్ తీసుకుని, వరద నీరు, డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లేలా రోడ్డు నిర్మించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా డ్రైన్లు, అవసరమైన చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు. కల్వర్టులు అవసరమైన ప్రాంతాలను జగ్గారెడ్డి, నిర్మల స్వయంగా పరిశీలించారు. రోడ్డు వెడల్పు, అందుబాటులో ఉన్న స్థలాన్ని టేపుతో కొలిచి మరీ పరిశీలించారు.కూల్చివేతలు లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. 30 అడుగుల వెడల్పు ఉన్నచోట 30 అడుగులు, 40 అడుగులు ఉన్నచోట 40 అడుగులు, 60 అడుగులు అందుబాటులో ఉన్నచోట 60 అడుగుల మేర రోడ్డు నిర్మించాలని చెప్పారు. తనకు తెలియజేయకుండా సిద్దాపూర్ రోడ్డులో ఏ డబ్బానూ తొలగించవద్దని స్పష్టం చేశారు. చిరు వ్యాపారులు, పాన్‌షాపులు, పూల దుకాణాలు, మటన్, చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పనులు జరగాలన్నారు. సిద్దాపూర్ కూడలిలో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా జంక్షన్ అభివృద్ధి చేయాలని సూచించారు. మధ్యలో విగ్రహం ఏర్పాటుకు అనువుగా సర్కిల్ రూపకల్పన చేయాలని చెప్పారు. రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిద్దాపూర్ రోడ్డు పనులకు సంబంధించి రూ.2 కోట్ల నిధులు మిగిలి ఉన్నాయని, మున్సిపాలిటీలో టీఎఫ్ఐడీసీకి చెందిన మరో రూ.5 కోట్ల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని సమీక్షలో ప్రస్తావించారు. కలెక్టర్‌తో సమావేశం అనంతరం సంబంధిత శాఖల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సరైన లెవల్స్, డ్రైన్లు, కల్వర్టులతో కూడిన 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణం, మండలంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు రోజూ ఒక ప్రాంతంలో పర్యటిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. త్వరలో ఊబ చెరువును పరిశీలిస్తానన్నారు.

సర్ పేరుతో ఓటు చోరికి పాల్పడుతున్న మోడీ ప్రభుత్వం

జ్ఞానేశ్ కుమార్‌ను ఎంతోకాలం కాపాడలేరు.

ప్రజా ఉద్యమాలను అణచివేసే హక్కు మోడీ సర్కారుకు ఎక్కడిది?

ఢిల్లీలో సీపీఎం నేతలు, నిరసనకారులపై పోలీసుల దమనకాండ.. నిర్బంధం సరికాదు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు.

సంగారెడ్డిలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమారు దిష్టి బొమ్మ దహనం.

మోడీ ప్రభుత్వ నిర్బంధంపై నల్లజెండలతో నిరసన.

సంగారెడ్డి అక్టోబర్ 10 నిలువుటద్దం ప్రతినిధి : సర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓటు చోరికి పాల్పడుతుందని, జ్ఞానేష్ కుమార్ ను మోడీ ఎంతకాలం కాపాడుతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు ప్రశ్నించారు. ప్రజా ఉద్యమాలను నిర్బంధంతో కేంద్ర ప్రభుత్వం ఆపాలని చూడటం అవివేకమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా పోరాటాలను అణచివేసే హక్కు మోడీకి లేదన్నారు. ఈరోజు ఢిల్లీలో కొనసాగుతున్న పోలీసుల అణచివేతను, అరెస్టులను ఖండిస్తూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో దిష్టిబొమ్మ దహనం, నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తుందన్నారు. అనేక మంది నిరసనకారులతో పాటు సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి, పొలిట్బ్యూరో సభ్యులు, కేరళ ప్రతిపక్ష నేత పినరయి విజయన్, సీనియర్ నేత బృందాకారత్, పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.వి.గోవిందన్, విజయ రాఘవన్, ఇతర కేంద్ర కమిటీ సభ్యులను అరెస్టు చేశారన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పదవి నుండి తొలగించాలన్నారు. రాజ్యాంగ బద్ధంగా పనిచేయాల్సి ఉండి ఎలక్షన్ కమిషన్ ఇవాళ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వాళ్లకు అనుకూలంగా మార్చుకొని సర్ పేరు మీద ఓట్లను తొలగించేటు వంటి ఒక దుర్మార్గమైన కార్యక్రమం తీసుకుందన్నారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించినట్టుగా ఇప్పటికే లెక్కలు వచ్చాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే

ఈ చర్యను అనేక ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, మానిక్, సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, రేవంత్, కృష్ణ నాయకులు అశోక్, బాలరాజు, శివ కుమార్, దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు, నిలువుటద్దం ప్రతినిధి: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బండలగూడలోని మార్క్స్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య చికిత్స పొందాలని సూచించారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

దత్తగిరి క్షేత్రంలో శని అమావాస్య వేడుకలు

–పూజలకు హాజరైన జహీరాబాద్ ఎంపీ

జహీరాబాద్, నిలువుటద్దం: సంగారెడ్డి జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో శనివారం శని అమావాస్య వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శనీశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. జహీరాబాద్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ స్థానిక నాయకులతో కలిసి శనీశ్వర స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం శివాలయంలో రుద్రాభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్, ఉత్సవ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ యూనుస్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జడ్పి చైర్మన్ సునీత హనుమంతరావు పాటిల్, మాజీ చైర్మన్ నల్లంబల్లి సిద్దన్న పాటిల్, కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్, కె. భాస్కర్ రెడ్డి, నాయకులు బి.శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పోలీస్ కోచింగ్ స్క్రీనింగ్ టెస్ట్‌కు విశేష స్పందన

జిల్లావ్యాప్తంగా 1,485 మంది అభ్యర్థుల హాజరు: ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, అక్టోబర్ 10, నిలువుటద్దం ప్రతినిధి: ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్ ప్రశాంతంగా ముగిసింది. సంగారెడ్డి, అందోల్, జహీరాబాద్ పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,485 మంది అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రాతిక్ జైన్, ఎస్పీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన, శారీరక శిక్షణ అందించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి పోలీసు ఉద్యోగాలు సాధించాలని సూచించారు.

గోనేమ్మ బస్తీలో ఘనంగా దుర్గామాత ఆగమన్!

– భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఘన స్వాగతం

– నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

పటాన్‌చెరు, అక్టోబర్ 10, నిలువుటద్దం ప్రతినిధి): పటాన్‌చెరు పరిధిలోని గోనేమ్మ బస్తీలో శుక్రవారం దుర్గామాత ఆగమన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గోనేమ్మ యూత్ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. డప్పుల మోతలు, భక్తుల జయజయధ్వానాలు, మహిళల మంగళహారతులతో బస్తీలో పండుగ వాతావరణం నెలకొంది. పటాన్‌చెరు మహంకాళి దేవాలయం నుంచి గోనేమ్మ బస్తీలోని గోనేమ్మ దేవాలయం వరకు అమ్మవారి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. బస్తీ మహిళలు సంప్రదాయబద్ధంగా హారతులు ఇచ్చి స్వాగతం పలుకగా, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులు సమర్పించారు. గత నాలుగేళ్లుగా బస్తీలో దుర్గామాత ఆగమన్, నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. అన్ని కులాల ప్రజల సహకారం, బస్తీవాసుల ఐకమత్యంతోనే ఉత్సవాలు విజయవంతమవుతున్నాయని పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా కొనసాగాలని, అమ్మవారి ఆశీస్సులు బస్తీ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాయికాడి నరేష్, పోచారం మనోజ్, మోహన్, మేకల దత్తాత్రేయ, గట్టు సందీప్, తడాకా సాయి, పల్లాటి రంజిత్, మంగలి రాజు, బాశెట్టి పవన్, హరీష్, మేకల ఫణి, మనిరాజ్ తదితరులతో పాటు గోనేమ్మ యూత్ సభ్యులు, మహిళలు, యువత, భక్తులు పాల్గొన్నారు.

వర్గల్ కస్తూర్బాలో త్రాగునీటి సమస్యకు పరిష్కారము

వర్గల్ అక్టోబర్ 10, నిలువుటద్దం ప్రతినిధి :వర్గల్ లోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చగా, పాఠశాల ప్రిన్సిపాల్ వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్ దృష్టికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో వారు సమస్య తీవ్రతను మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి విన్నవించారు. దీంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని శనివారం బోరు బండిని రప్పించి విద్యాలయ ఆవరణలో బోరు వేయించారు. దీంతో గత కొంతకాలంగా నెలకొన్న త్రాగునీటి సమస్యకు పరిష్కారం లభించగా, విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం వారికి కృతజ్ఞతలు తెలిపింది. కాగా మొదటగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, పాఠశాల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది, నాణ్యమైన విద్యను అందిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలని గురువులకు సూచించారు. విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొన్నాల నర్సారెడ్డి, ఉప సర్పంచ్ టేకులపల్లి గోవర్ధన్ రెడ్డి, వర్గల్ మాజీ సర్పంచ్ తుంకుంట గోపాల్ రెడ్డి, వర్గల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, మాజీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు అమ్మగారి తేజస్వి అరవింద్ రెడ్డి, తుంకుంట శ్రీనివాస్ రెడ్డి, అయ్యగల్ల బన్నీ రాజ్, గంగారం పరశురాములు, మాజీ కోఆప్షన్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల ప్రగతికి నాంది కేసీఆర్

– నూతన మండల ఏర్పాటుతోనే వేగవంతమైన అభివృద్ధి

– మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

– బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

– మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

గుమ్మడిదల, నిలువుటద్దం: గుమ్మడిదల నూతన మండలంగా రూపాంతరం చెంది పదేళ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. నూతన మండల ఏర్పాటుతోనే గుమ్మడిదల ప్రాంతం అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని నాయకులు కొనియాడారు. గుమ్మడిదల నూతన మండలంగా ఏర్పాటై దశాబ్ద కాలం (10 ఏళ్లు) పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 2016లో కేసీఆర్ హయాంలో గుమ్మడిదలను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయడం వల్లే ఈ ప్రాంత ప్రగతికి పునాది పడిందన్నారు. మండల ఏర్పాటు ద్వారా పరిపాలనా సౌలభ్యంతో పాటు మౌలిక వసతులు వేగంగా అందుబాటులోకి వచ్చాయని, నేడు గుమ్మడిదల అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు రాజశేఖర్, చక్రపాణి, విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్, శేఖర్ రెడ్డి, సదానంద రెడ్డి, మొగులయ్య,శ్రీనివాస్ రెడ్డి, అంజనేయులు యాదవ్, వినోద్ గౌడ్, రమేష్, సత్యనారాయణ ,ప్రకాష్, రాజు, రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

పటాన్చెరు, నిలువుటద్దం ప్రతినిధి: బండ్లగూడలోని మార్క్స్ నగర్ కాలనీలో పటాన్చెరు క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్, దీ=ూ పార్టీ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ గారు పాల్గొన్నారు.యశోద హాస్పిటల్స్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో గుండె సంబంధిత సమస్యలు, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, కంటి పరీక్షలు, రక్తపరీక్షలు, జుజ+, 2ఱ ఎకో, ఆర్థోపెడిక్ తదితర వైద్య సేవలను ప్రజలకు అందించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చిన క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు.

డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా కృషి

పదవి ఉన్నా.. లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రామచంద్రపురం, అక్టోబర్ 10: నిలువుటద్దం: డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ స్పష్టం చేశారు. రామచంద్రపురం డివిజన్‌లోని శ్రీ సాయినగర్ కాలనీలో మంజూరైన సీసీ రోడ్డు పనులను త్వరగా ప్రారంభించేందుకు కాలనీ అధ్యక్షుడు వీర్శెట్టి, కార్యవర్గ సభ్యులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించారు. రోడ్డు నిర్మించాల్సిన ప్రాంతాలను పరిశీలించి, కాంట్రాక్టర్‌ను పిలిపించి పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. అనంతరం బతుకమ్మ పండుగ సందర్భంగా శ్రీ సాయినగర్ కాలనీవాసులు థీమ్ పార్క్ పరిధిలో ఏర్పాటు చేసుకున్న బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించారు. పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్ అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

బొల్లారం పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు.. వారిని కంటికి రెప్పలా చూసుకోవాలి: కేజేఆర్ ఆనంద్ కృష్ణ రెడ్డి

బొల్లారం, నిలువుటద్దం: బొల్లారం పబ్లిక్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల యజమాని ప్రభు సర్ ఆహ్వానం మేరకు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల బతుకమ్మ ఆటలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని సూచించారు. తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, వారిని గౌరవిస్తూ కంటికి రెప్పలా చూసుకోవాలని హితవు పలికారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
ఆదివారం 11-10-2026

దాట్ల గ్రామంలో బతుకమ్మ విగ్రహం ధ్వంసం



మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామంలో గుర్తుతెలియని దుండగులు వికృత చేష్టకు పాల్పడ్డారు. ఎంగిలిపూల బతుకమ్మ పండుగ ప్రారంభమవుతున్న తరుణంలో గ్రామ ముఖద్వారాన ఉన్న బతుకమ్మ విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ మంజుల పేరు ఉన్న శిలాఫలకాన్ని కొందరువ్యక్తులు ధ్వంసం చేశారు. బతుకమ్మ విగ్రహంపై జరిగిన ఈ దాడిని గ్రామస్థులు తీవ్రంగా ఖండించారు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు.

కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

జగద్గిరిగుట్ట: కిడ్నాప్ కేసులో నిందితుడిని పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 7వ తేదీన (07-10-2026) నమోదైన కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్న బి. చంద్రశేఖర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌కు చెందిన చంద్రశేఖర్‌పై జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 1358/2026 కింద కేసు నమోదైంది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని పట్టుకుని, తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

మోతినగర్ న్యూటన్ హైస్కూల్ పాఠశాలలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

మోతి నగర్ న్యూటన్ హై స్కూల్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థినిలు రకరకాల పువ్వులతో అందమైన బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో అలరించారు. ముఖ్యంగా బతుకమ్మ పాటలు, కోలాటం ఆట ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల న్యూటన్ హై స్కూల్స్ చైర్మన్ పీజే రెడ్డి గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన సంస్కృతిని,సాంప్రదాయాలను భావితరాలకు అందించవలసిన బాధ్యత ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులకు ఉండాలని అన్నారు. విద్యార్థులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యూటన్ హై స్కూల్స్ చైర్మన్ పీజే రెడ్డి గారు డైరెక్టర్స్ రమేష్ రెడ్డి గారు మరియు రాజేష్ రెడ్డి గారు ప్రిన్సిపల్ సుభాషిని తదితరులు పాల్గొన్నారుపాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భవాని మాత ఆలయ హుండీ దొంగ అరెస్ట్

వివరాలు వెల్లడించిన సీఐ వెంకటేష్

సదాశివపేట, నిలువుటద్దం ప్రతినిధి: సదాశివపేట పట్టణంలోని గురు నగర్ కాలనీ లో గల భవాని మాత మందిర్ లో ఈ నెల 3 న మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని ఒక వ్యక్తి ఆలయంలోకి చొరబడి హుండీని పగలగొట్టి హుండీలో గల డబ్బులు దొంగలించినట్లు ఆలయ కమిటీ మెంబర్ ఫిర్యాదు మేరకు వెంటనే ఇన్స్పెక్టర్ డి వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి సాంకేతిక పరిజ్ఞానంతో కృషి చేసి నిందితుడిని గుర్తించి నిందితుని నుంచి దొంగతనం అయిన సొమ్మును రికవరీ చెయ్యడం జరిగిందని సీఐ వెంకటేష్ తెలిపారు. శనివారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు.నిందితుడు సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామానికి చెందిన మల్లేపల్లి శ్రీనివాస్ (29) అను వ్యక్తి మద్యానికి బానిసై చెడు వ్యసనాలకు జల్సాలకు అలవాటు పడి అతను సంపాదించే డబ్బులు సరిపోక ఏదైనా దొంగతనం చేయాలని ఉద్దేశంతో భవాని మతాలయంలో హుండీ దొంగలించినట్లు తెలిపారు.అదే విధంగా దర్యాప్తులో నిందితుడు గతంలో కూడా సదాశివపేట పరిధిలోని రెండు ఆలయల్లో హుండీ దొంగతనాలు చేసి జైలుకి వెళ్లి వచ్చినట్లు తాము గుర్తించినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు నిమిత్తం జ్యుడీషియల్ రిమాండ్ కి తరలించి నట్లు సీఐ పేర్కొన్నారు.

జయనగర్ కాలనీ డ్రైనేజీ సమస్యకు పరిష్కార దిశగా అడుగులు

రూ.20 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ......

శేరిలింగంపల్లి, నిలువుటద్దం ప్రతినిధి: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జయనగర్ కాలనీలో ఎన్నో ఏళ్లుగా స్థానికులు ఎదుర్కొంటున్న భూగర్భ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. రూ.20 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పైప్‌లైన్ పనులకు శేరిలింగంపల్లి నియోజకవర్గ పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. వివిధ కాలనీల ప్రజల నుంచి అందిన వినతులను పరిగణనలోకి తీసుకొని, అత్యవసర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జయనగర్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో యూజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. మురుగునీరు తరచూ పొంగిపొర్లుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ పనులు చేపడతామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలు

తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నాణ్యతలో రాజీ వద్దు.. పనుల్లో జాప్యం చేయొద్దు

ఏళ్ల తరబడి కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యల కారణంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యూజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు గాంధీ వివరించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు ప్రతి కాలనీలో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన పైప్‌లైన్ నిర్మాణ పనులపైనా దృష్టి సారిస్తామని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, పనుల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. పనుల్లో అనవసర జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కాలనీల్లో పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆరెకపూడి గాంధీ తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం శ్రీనివాస రాజు, మేనేజర్ అనిల్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్, మదురై విజయవంతంగా 100 రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

నిలువుటద్దం హైదరాబాద్ అక్టోబర్ 10: అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్, మదురై, విజయవంతంగా 100 రోబోటిక్ సహాయక శస్త్రచికిత్సలను పూర్తి చేసింది. అచీవ్మెంట్ దక్షిణ తమిళనాడులో ఉన్న రోగులకు అధునాతన రోబోటిక్-సహాయక కనిష్టాత్మకంగా శస్త్రచికిత్స శస్త్రచికిత్సలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. శస్త్రచికిత్సా గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ, అబ్స్టెట్రిటిక్స్ ఊ గైనకాలజీ, శస్త్రచికిత్స ఆంకాలజీ మరియు జనరల్ సర్జరీ, అనుభవజ్ఞుడైన శస్త్రచికిత్స జట్లు, అధునాతన టెక్నాలజీ మరియు ఒక రోగి సంరక్షణకు మల్టీడిసిప్లినరీ విధానం. రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స అధునాతన రోబోటిక్ టెక్నాలజీతో అత్యంత శిక్షణ పొందిన శస్త్రచికిత్సల నైపుణ్యాన్ని మిళితం చేస్తుంది, మెరుగైన విజువలైజేషన్, సున్నితత్వం మరియు నియంత్రణతో చిన్న కోణాల ద్వారా నిర్వహించబడే విధానాలను ఎనేబుల్ చేస్తుంది. విధానము మరియు రోగి పరిస్థితిని బట్టి, రోబోటిక్ శస్త్రచికిత్స తగ్గిన శస్త్రచికిత్స గాయం, తక్కువ శస్త్రచికిత్సా నొప్పి, తక్కువ ఆసుపత్రిలో, తక్కువ రికవరీ మరియు ముందు సాధారణ కార్యకలాపాలకు తిరిగి వచ్చే ప్రయోజనాలను అందిస్తుంది. 100-శస్త్రచికిత్స మైలురాయి రోబోటిక్ ఎటెప్, రోబోటిక్ ఎటెప్, రోబోటిక్ విప్లె విధానం, రోబోటిక్ హెమిటోయోలెక్టోమీ, రోబోటిక్ హెరోరోక్టోమీ, రోబోటిక్ గర్భాశయ యొక్క రోబోటిక్ శస్త్రచికిత్స సామర్థ్యాల వెడల్పును ప్రదర్శించే రోబోటిక్ గర్భాశయం వంటిది. 100 రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అధునాతన శస్త్రచికిత్స పద్ధతులకు యాక్సెస్ మరియు దాని మల్టీడిసిప్లినరీ క్లినికల్ సామర్థ్యాలను బలపరిచేటప్పుడు ఆసుపత్రి ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశను సూచిస్తుంది. అనుభవజ్ఞులైన నిపుణులు మరియు ఆధునిక ఆపరేటింగ్-రూమ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్, మదురై, ఈ ప్రాంతానికి రోగి కేంద్రీకృత, అధిక-నాణ్యత ఆరోగ్య సంరక్షణను పంపిణీ చేయటం కొనసాగించింది. మైలురాయిపై వ్యాఖ్యానిస్తూ, డాక్టర్ నిఖిల్ తివారీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ - రోటన్, అపోలో హాస్పిటల్స్, "అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్, మదురైలో 100 రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తయ్యాయి, మా ప్రయాణంలో గణనీయమైన మైలురాయి దక్షిణ తమిళనాడులో ఉన్న రోగులకు ఆధునిక శస్త్రచికిత్స సంరక్షణను తీసుకురావడం. రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స క్లినికల్ నైపుణ్యం, సాంకేతికత మరియు ఖచ్చితత్వము యొక్క కలయికను సూచిస్తుంది. రోగులకు ఆరోగ్య సంరక్షణలో తాజా పురోగమనాలకు ప్రాప్యత కలిగి ఉన్నాయని మన దృష్టి ఎల్లప్పుడూ ఉందని నిర్ధారించుకోండి, అనుభవజ్ఞులైన వైద్యులు మరియు సమగ్ర మల్టీడిసిప్లినరీ కేర్ మద్దతు. ఈ సాధించిన మా శస్త్రచికిత్స జట్లు అంకితభావం ప్రతిబింబిస్తుంది మరియు మదురై నుండి ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ పంపిణీ మా నిబద్ధత బలవంతం. " డాక్టర్ పి. షోబనా, మెడికల్ సూపరింటెండెంట్, అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్, మదురై మాట్లాడుతూ, "మా సుదూరాల యొక్క మైలురాయిని చేరుకుంటూ, మా సర్జన్లు, అనస్థీషియాలజిస్ట్, నర్సింగ్ జట్లు, క్రిటికల్ కేర్ నిపుణులు, సాంకేతిక నిపుణులు మరియు మద్దతు బృందాలు. రోబోటిక్ శస్త్రచికిత్స ప్రత్యేక శిక్షణ, మౌలిక సదుపాయాలు మరియు రోగి సంరక్షణ ప్రతి దశలో దగ్గరగా జట్టుకృషిని అవసరం. అపోలో మదురైలో, నిరంతరం మా సామర్థ్యాలను బలపరిచేందుకు మరియు ఆధునిక, సురక్షితమైన మరియు వ్యక్తిగతీకరించిన శస్త్రచికిత్స సంరక్షణతో రోగులను అందించడానికి మేము కట్టుబడి ఉంటాము. " డాక్టర్ శ్రీనివాసన్ రామచంద్రన్, కన్సల్టెంట్ - సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, అపోలో స్పెషాలిటీ గ్యాస్ట్రోఎంటలజీ, మదురై మాట్లాడుతూ "రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స అనేది సంక్లిష్ట మరియు ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్సలు వంటి సంక్లిష్ట జీర్ణవ్యవస్థ పద్ధతులలో ముఖ్యంగా విలువైనది లోతైన శరీర నిర్మాణ నిర్మాణాలకు సవాలుగా ఉంది. దాని మెరుగైన సామర్థ్యం మరియు ఖచ్చితత్వము క్లిష్టమైన విభజన మరియు సూటర్ను సులభతరం చేస్తుంది, క్లిష్టమైన విధానాల ద్వారా క్లిష్టమైన విధానాలకు మద్దతు ఇస్తుంది. " డాక్టర్. ఖ. బాలూ మహేంద్ర, కన్సల్టెంట్ - శస్త్రచికిత్స ఆంకాలజీ, అపోలో క్యాన్సర్ కేంద్రాలు, మదురై, "శస్త్రచికిత్స ఆంకాలజీలో, రోబోటిక్ టెక్నాలజీలో సుదీర్ఘమైన సంక్లిష్ట ప్రాంతాలను జాగ్రత్తగా పరిశీలిస్తుంది వైద్యపరంగా తగినది ఎక్కడ ఉన్నది. ప్రాథమిక లక్ష్యం పూర్తి మరియు సమర్థవంతమైన క్యాన్సర్ తొలగింపును కలిగి ఉంటుంది, కనీస దండయాత్ర పద్ధతులతో శస్త్రచికిత్స గాయం తగ్గించడం మరియు అర్హతగల రోగులలో రికవరీకి మద్దతు ఇవ్వడం. " డాక్టర్ ఆర్. విష్ణురాజ, కన్సల్టెంట్ - యూరాలజీ ఊ ఆండ్రోలజీ, అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్, మదురై, "రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స ప్రోస్టేట్, మూత్రపిండాలు మరియు మూత్రాశయం మరియు మూత్రాశయం మరియు మూత్రాశయం, ఖచ్చితమైన విభజన మరియు పునర్నిర్మాణం అవసరం. మెరుగైన ఇన్స్ట్రుమెంట్ కంట్రోల్ సున్నితమైన నరములు మరియు పరిసర కణజాలాలను కాపాడటానికి సహాయపడుతుంది, ఇది ఫంక్షనల్ ఫలితాలను ఒక కీలకమైన పరిశీలనలో ఉన్న విధానాల్లో ముఖ్యమైనది. " డాక్టర్. జె. మధుసుధనన్, కన్సల్టెంట్ - సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ; డాక్టర్ కె. హేలేలేఖ, సీనియర్ కన్సల్టెంట్ - ప్రసూతిని ఊ గైనకాలజీ; మరియు డాక్టర్ రాఘవి నటరాజన్, కన్సల్టెంట్ - ప్రసూతి.కూడా చెప్పారు: "రోబోటిక్ సహాయక శస్త్రచికిత్స సంప్రదాయ ఓపెన్ మరియు లాపరోస్కోపిక్ విధానాలు ఒక పురోగతి సూచిస్తూ 3ఊ వృద్ధినిచ్చే దృష్టి, మెరుగుపరచబడిన వాయిద్యం సామర్థ్యం, క్లిష్టమైన విధానాల సమయంలో స్థిరమైన సూక్ష్మ కదలికలు మరియు ఎక్కువ సున్నితమైనవి. ఓపెన్ శస్త్రచికిత్సతో పోలిస్తే, ఇది శస్త్రచికిత్సా ఛాలెంజ్ కేసుల్లో సాంప్రదాయిక లాపరోస్కోపీ కంటే ఎక్కువ వశ్యత మరియు వాయిద్యం ఉచ్చారణను అందించేటప్పుడు, చిన్న కోణాల ద్వారా నిర్వహించటానికి సహాయపడుతుంది. ఈ ప్రయోజనాలు కణజాల గాయం మరియు రక్త నష్టం తగ్గించడానికి సహాయపడుతుంది, శస్త్రచికిత్సా నొప్పిని తగ్గిస్తుంది మరియు వేగంగా రికవరీని తగ్గిస్తుంది, వారి సాధారణ రొటీన్కు తిరిగి రావడానికి అర్హతగల రోగులు ప్రారంభించవచ్చు. " 100 రోబోటిక్ శస్త్రచికిత్సల సాధించిన దక్షిణ తమిళనాడులో అధునాతన కనిష్ఠ అనారోగ్య శస్త్రచికిత్స పద్ధతుల పెరుగుతున్న దత్తతను ప్రదర్శిస్తుంది. రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స అనేది మెరుగైన ఖచ్చితమైన మరియు యాక్సెస్ యాక్సెస్ అవసరమయ్యే విధానాలకు ప్రత్యేకంగా విలువైనదిగా ఉంటుంది. టెక్నాలజీ శస్త్రచికిత్సా క్షేత్రాన్ని ఒక పెద్దదిగా, అధిక-నిర్వచనం వీక్షణతో సర్జన్లను అందిస్తుంది మరియు ప్రత్యేక సాధన యొక్క ఖచ్చితమైన కదలికను అనుమతిస్తుంది. సాంప్రదాయిక ఓపెన్ శస్త్రచికిత్స కాకుండా, పెద్ద కోతలు అవసరమయ్యే, రోబోటిక్-సహాయక విధానాలు సాధారణంగా చిన్న కీహోల్ కోతలు ద్వారా నిర్వహిస్తారు. రోబోటిక్ వ్యవస్థ స్వతంత్రంగా పనిచేయదు; అయితే, శస్త్రచికిత్సలో పూర్తి నియంత్రణను నిర్వహించడానికి సర్జన్ను ప్రత్యేకమైన సాధనల యొక్క ఖచ్చితమైన కదలికలలో సర్జన్ యొక్క చేతి కదలికలను అనువదిస్తుంది. అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్, మదురైలోని రోబోటిక్ శస్త్రచికిత్స కార్యక్రమం, అంకితమైన ఆపరేటింగ్-రూమ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మరియు ఒక మల్టీడిసిప్లినరీ బృందం, శస్త్రచికిత్సలు, అనస్థీషియాలజిస్ట్, నర్సులు, ఇంటెన్సివిస్ట్, టెక్నీషియన్లు మరియు ఇతర హెల్త్కేర్ నిపుణులు. జాగ్రత్తగా రోగి ఎంపిక మరియు వివరణాత్మక ప్రీపెరాటివ్ మూల్యాంకనం ఒక వ్యక్తి రోగికి రోబోటిక్ శస్త్రచికిత్సకు తగినదో నిర్ణయించడానికి సమగ్రంగా ఉంటుంది. మైలురాయి అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్, మధురై యొక్క అపోలో యొక్క నిబద్ధత, ఆధునిక శస్త్రచికిత్స సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావడానికి, ప్రత్యేకమైన క్లినికల్ నైపుణ్యం మరియు దక్షిణ తమిళనాడులో ఉన్న రోగులకు మినహాయింపు చికిత్సా చికిత్స ఎంపికలు. టెక్నాలజీలో నిరంతర పెట్టుబడి, శిక్షణ మరియు మల్టీడిసిప్లినరీ కేర్, అపోలో మదురై రోబోటిక్-సహాయక శస్త్రచికిత్స పరిధిని విస్తరించడానికి ఈ ప్రాంతంలోని మరింత రోగులకు అందుబాటులో ఉన్న సర్జికల్ కేర్ను మరింత విస్తరించడానికి ప్రయత్నిస్తుంది.

శక్తి ఆరాధనకు శరన్నవరాత్రులు... ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ!

ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే నవరాత్రులు -- తెలంగాణ సంస్కృతికి జీవం పోసే బతుకమ్మ

స్త్రీశక్తికి ప్రతీకగా అమ్మవారి ఆరాధన... ప్రకృతితో మమేకమయ్యే పూల పండుగ.....

నిలువుటద్దం ప్రత్యేక కథనం శేరిలింగంపల్లి, అక్టోబర్ 10: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో పండుగలకు విశిష్టమైన స్థానం ఉంది. ప్రతి పండుగ వెనుక ఒక ఆధ్యాత్మిక పరమార్థం, ఒక సామాజిక సందేశం, ప్రకృతితో ముడిపడిన జీవన విధానం దాగి ఉంటాయి. అటువంటి విశిష్టతను చాటిచెప్పే పండుగలలో శరన్నవరాత్రులు, తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన బతుకమ్మ పండుగ అగ్రస్థానంలో నిలుస్తాయి. శరన్నవరాత్రులు దైవశక్తిని ఆరాధిస్తూ ధర్మం, భక్తి, ఆత్మవిశ్వాసం, సత్యానికి ప్రతీకగా నిలిస్తే, బతుకమ్మ పండుగ ప్రకృతిని ప్రేమించడం, పూలను పూజించడం, మహిళల ఐక్యతను చాటడం, తెలంగాణ అస్తిత్వాన్ని తరతరాలకు అందించడం వంటి గొప్ప సందేశాలను అందిస్తుంది. ఈ రెండు పండుగల రూపాలు వేర్వేరైనా, వాటి అంతరార్థంలో స్త్రీశక్తికి గౌరవం, జీవనానికి మంగళం, కుటుంబాల్లో సంతోషం, సమాజంలో ఐక్యత అనే విలువలు అంతర్లీనంగా కనిపిస్తాయి.

శరన్నవరాత్రులు అంటే ఏమిటి?

ఆశ్వయుజ మాసంలో జరుపుకునే శరన్నవరాత్రులు దుర్గాదేవి ఆరాధనకు అత్యంత పవిత్రమైన తొమ్మిది రోజులు. దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించి ధర్మాన్ని నిలబెట్టిందనే పురాణగాథ ఈ పండుగకు ప్రధాన నేపథ్యం. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అజ్ఞానంపై జ్ఞానం, నిరాశపై ఆత్మవిశ్వాసం సాధించే విజయానికి శరన్నవరాత్రులు ప్రతీకగా నిలుస్తాయి. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో పూజించడం సంప్రదాయం. ప్రాంతీయ ఆచారాలు, కుటుంబ సంప్రదాయాలను అనుసరించి పూజా విధానాలు మారవచ్చు. దుర్గాదేవి, లక్ష్మీదేవి, సరస్వతీదేవి ఆరాధనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారు. కొందరు భక్తులు ఉపవాసాలు పాటిస్తారు. మరికొందరు కలశ స్థాపన చేసి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయాలు విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటాయి. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని ఆరాధించడం కేవలం కోరికలు నెరవేరాలని ప్రార్థించడమే కాదు. మనలోని భయాన్ని తొలగించుకోవడం, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యాన్ని పెంపొందించుకోవడం, కష్టాలను ఎదుర్కొనే మనోబలాన్ని సాధించడం కూడా ఈ పండుగ అందించే అంతరార్థంగా భావించవచ్చు. నవదుర్గల ఆరాధనలో అంతరార్థం శరన్నవరాత్రుల్లో నవదుర్గలుగా ప్రసిద్ధి చెందిన అమ్మవారి తొమ్మిది రూపాలను ఆరాధించే సంప్రదాయం ఉంది. వాటిలో ప్రతి రూపం ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక భావనను ప్రతిబింబిస్తుంది.

శైలపుత్రి: స్థిరత్వం, ప్రకృతితో అనుబంధానికి ప్రతీక.

బ్రహ్మచారిణి: తపస్సు, సహనం, సంకల్పబలానికి ప్రతీక.

చంద్రఘంట: ధైర్యం, అప్రమత్తత, శౌర్యానికి ప్రతీక.

కూష్మాండ: సృష్టిశక్తి, జీవనోత్సాహానికి ప్రతీక.

స్కందమాత: మాతృత్వం, ప్రేమ, కరుణకు ప్రతీక.

కాత్యాయనీ: ధైర్యం, అన్యాయాన్ని ఎదుర్కొనే శక్తికి ప్రతీక.

కాళరాత్రి: భయాన్ని అధిగమించడం, అజ్ఞానాన్ని తొలగించుకోవడానికి ప్రతీక.

మహాగౌరి: పవిత్రత, ప్రశాంతత, శాంతికి ప్రతీక.

సిద్ధిదాత్రి: సాధన, జ్ఞానం, ఆధ్యాత్మిక పరిపూర్ణతకు ప్రతీక. ఈ రూపాల ఆరాధన ద్వారా స్త్రీలోని శక్తిని మాత్రమే కాకుండా ప్రతి మనిషిలో దాగి ఉన్న ధైర్యం, కరుణ, సహనం, జ్ఞానం వంటి సద్గుణాలను గుర్తు చేసుకోవచ్చు.

సరస్వతీ పూజ -- విద్య, విజ్ఞానానికి గౌరవం

నవరాత్రుల్లో సరస్వతీదేవి ఆరాధనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. విద్యార్థులు తమ పుస్తకాలు, కలాలు, సంగీత వాయిద్యాలు, కళలకు సంబంధించిన వస్తువులను అమ్మవారి ముందు ఉంచి పూజిస్తారు. విద్య అనేది కేవలం ఉద్యోగం సంపాదించడానికి మాత్రమే కాకుండా, మంచి చెడులను గుర్తించడానికి, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన సాధనమని ఈ ఆరాధన గుర్తుచేస్తుంది. లక్ష్మీదేవి ఆరాధన సంపద, ఐశ్వర్యం, శ్రేయస్సుకు ప్రతీకగా భావించబడుతుంది. అయితే సంపద అంటే కేవలం ధనం మాత్రమే కాదు. ఆరోగ్యం, కుటుంబ సంతోషం, జ్ఞానం, పరస్పర సహకారం, సంతృప్తి కూడా నిజమైన సంపదలేనని ఈ పండుగలు మనకు బోధిస్తాయి.

బతుకమ్మ -- తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ ఒక ప్రత్యేక గుర్తింపు. ప్రకృతిలో సహజంగా పూసే రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను ఆరాధిస్తూ మహిళలు సామూహికంగా పాటలు పాడుతూ, వలయాకారంలో తిరుగుతూ సంబరాలు జరుపుకుంటారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి కాలానుగుణ పూలతో బతుకమ్మను అందంగా అలంకరిస్తారు. పూలను వరుసలుగా పేర్చి రూపొందించే బతుకమ్మ రూపం తెలంగాణ పల్లెల అందాలను, ప్రకృతితో ప్రజల అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి పువ్వులో ఒక అందం, ప్రతి రంగులో ఒక ఆనందం, ప్రతి పాటలో ఒక చరిత్ర, ప్రతి చప్పట్లో ఒక సామూహిక ఉత్సాహం కనిపిస్తాయి. బతుకమ్మ పండుగలో మహిళలు తమ కుటుంబాల శ్రేయస్సు, ఆరోగ్యం, సౌభాగ్యం కోసం ప్రార్థిస్తారు. అదే సమయంలో తమ బాల్యాన్ని, పల్లె జీవితాన్ని, కుటుంబ బంధాలను, స్థానిక సంప్రదాయాలను పాటల రూపంలో సజీవంగా నిలుపుకుంటారు. తరతరాలుగా వస్తున్న జానపద గీతాల్లో తెలంగాణ సామాజిక జీవితం, మహిళల అనుభవాలు, ప్రకృతి సౌందర్యం, కుటుంబ అనుబంధాలు ప్రతిధ్వనిస్తాయి. బతుకమ్మ అనేది కేవలం పూల పండుగ కాదు. తెలంగాణ మహిళల సృజనాత్మకతకు, ఐక్యతకు, సాంస్కృతిక స్వాభిమానానికి నిలువెత్తు నిదర్శనం.

బతుకమ్మ పేరులోనే జీవన సందేశం

'బతుకమ్మ' అనే పేరు వినగానే జీవితం, జీవనోత్సాహం, అమ్మతనం గుర్తుకొస్తాయి. ఈ పండుగలో గౌరమ్మను పూజిస్తూ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిస్తారు. గ్రామాల్లో చెరువులు, కుంటలు, బహిరంగ ప్రదేశాల వద్ద మహిళలు గుమిగూడి బతుకమ్మ ఆడటం సామూహిక జీవనానికి ప్రతీక. ఒకరి ఇంటి పండుగగా కాకుండా ఊరంతా కలిసి జరుపుకునే వేడుకగా బతుకమ్మ ప్రత్యేకతను చాటుతుంది. కులమత, ఆర్థిక భేదాలకు అతీతంగా మహిళలు ఒకచోట చేరి పాటలు పాడటం, పూలను పేర్చటం, ఆనందాన్ని పంచుకోవటం సామాజిక సమైక్యతకు బలాన్నిస్తుంది. నేటి వేగవంతమైన జీవన విధానంలో వ్యక్తుల మధ్య దూరాలు పెరుగుతున్న తరుణంలో బతుకమ్మ వంటి పండుగలు మనుషులను దగ్గర చేస్తాయి. బంధుమిత్రులను కలుపుతాయి. పాత జ్ఞాపకాలను గుర్తుచేస్తాయి. పిల్లలకు తమ ప్రాంతపు భాష, పాటలు, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తాయి.

ప్రకృతిని పూజించే గొప్ప సంప్రదాయం

బతుకమ్మ పండుగలో ప్రధానంగా ఉపయోగించే పూలు ప్రకృతిలో లభించే కాలానుగుణ పుష్పాలు. వర్షాకాలం ముగిసి, ప్రకృతి పచ్చదనంతో కళకళలాడే సమయంలో ఈ పండుగ రావడం విశేషం. చెరువులు, కుంటలు, పంటపొలాలు, పూల మొక్కలు గ్రామీణ జీవన విధానంలో ఎంత ముఖ్యమైనవో ఈ పండుగ గుర్తుచేస్తుంది. ప్రకృతిని కేవలం వనరుల సమాహారంగా కాకుండా జీవనాధారంగా చూడాలనే సందేశం బతుకమ్మలో అంతర్లీనంగా ఉంది. పూలను గౌరవించడం, మొక్కలను కాపాడటం, చెరువులను పరిశుభ్రంగా

ఉంచటం, నీటిని సంరక్షించడం వంటి బాధ్యతలను కూడా ఈ పండుగ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలి. పండుగ ముగిసిన తర్వాత బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసే సంప్రదాయం ఉన్నప్పటికీ, నేటి కాలంలో ప్లాస్టిక్ అలంకరణలు, కృత్రిమ పదార్థాలు, రసాయనాలతో కూడిన వస్తువులను నీటిలో వేయకుండా జాగ్రత్తపడాలి. సహజ పూలను ఉపయోగించడం, నిమజ్జన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం, చెరువుల పరిరక్షణకు సహకరించడం ద్వారా పండుగ స్ఫూర్తిని పర్యావరణ హితంగా కొనసాగించవచ్చు.

సద్దుల బతుకమ్మ -- సంబరాలకు సంపూర్ణత

బతుకమ్మ ఉత్సవాల్లో సద్దుల బతుకమ్మకు విశేష ప్రాధాన్యం ఉంది. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో బతుకమ్మలను పేర్చి ఆడుకునే సంప్రదాయం తెలంగాణ ప్రాంతాల్లో విస్తృతంగా కనిపిస్తుంది. చివరి రోజు మహిళలు మరింత వైభవంగా బతుకమ్మలను అలంకరించి, సామూహికంగా వేడుకలు నిర్వహిస్తారు. ప్రాంతీయ ఆచారాలను బట్టి బతుకమ్మ పేర్లు, నైవేద్యాలు, పూజా విధానాల్లో కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. సద్దుల బతుకమ్మ సందర్భంగా సద్దులు, పులిహోర, ఇతర సంప్రదాయ నైవేద్యాలను సమర్పించే ఆచారం ఉంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కలిసి పండుగను జరుపుకోవడం ద్వారా ఆప్యాయతలు మరింత బలపడతాయి. బతుకమ్మ పాటలు ఈ వేడుకలకు ప్రాణం. వాటిలోని పదాలు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా ఒక తరం నుంచి మరో తరానికి చేరే సాంస్కృతిక సంపద. పెద్దలు పాడే పాటలను పిల్లలు నేర్చుకోవడం ద్వారా తెలంగాణ జానపద సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు అందుతాయి.

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027